ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 8 జనవరి 2025


చిత్రపటాల ఆవిష్కరణ సభలో ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్, వామపక్షాలు, ఎండీఎంకే నేతలు

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్

దేశ ఆర్థికాభివృద్ధికి పునాది ● చిత్రపటావిష్కరణ సభలో సీఎం స్టాలిన్

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే భారతదేశ అభివృద్ధికి పునాదని ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో మంగళవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఈరోడ్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై దివంగత నేతల చిత్రాలను ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. ఆ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి మూల స్తంభంగా నిలిచిన డాక్టర్ మన్మోహన్ సింగ్, అలాగే టీఎన్‌సీసీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన ఈవీకేఎస్ ఇళంగోవన్ భౌతికంగా మన మధ్య లేకపోవడం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. వ్యక్తి గతంగా ఆ ఇద్దరితో మంచి పరిచయాలున్నాయని, వారి మరణం తనకు కూడా లోటన్నారు. ద్రవిడ పితామహుడు పెరియార్ మనవడు ఈవీకే సంపత్ కుమారుడైన ఇళంగోవన్ రాజకీయ కుటుంబంలో జన్మించి, ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రి వర్గంలో జౌళి శాఖామంత్రిగా పనిచేసి ఆ శాఖ అభివృద్ధికి కూడా పాటు పడ్డారన్నారు. దేశంలోని అతి కొద్దిమంది ఆర్థిక నిపుణుల్లో ఒకరైన మన్మోహన్ సింగ్ అతిక్లిష్టమైన పరిస్థితుల్లో కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించి భారతదేశాభివృద్ధికి పునాదులు వేసి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. 2004వ సంవత్సరం దేశంలో అత్యున్నతమైన ప్రధానమంత్రి పదవి మన్మోహన్ సింగ్ వరించిందన్నారు. దేశ రాజకీయాలను శాసించ గలిగే స్థాయి ఉన్నప్పటికీ ఆయన నిరాడంబరంగా జీవించి 10ఏళ్లు ప్రధానిగా దేశ ప్రజలకు మంచి పాలన అందించిన మహనీయుడని సీఎం కీర్తించారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చే పథకాలను ప్రవేశపెట్టాడని, ఎన్నో మహోత్తర పథకాలు ఆయన చలవేనని తెలిపారు. ఆయన పదేళ్ల పాలనలో 21 మంది తమిళులు కేంద్రమంత్రులుగా పని చేశారని, ఇందు వల్ల తమిళనాడుకు మరింత ఘనత చేకూర్చిన ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, కేంద్రమాజీ మంత్రులు పి.చిదంబరం, కేవీ తంగబాలు, తిరునావుక్కరసర్, మాజీ ఎంపీ కృష్ణస్వామి, ద్రావిడర్ కళగమ్ అధ్యక్షుడు వీరమణి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీపీఐ ఎంపీ తిరుమావళవన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం మాజీ కార్యదర్శి కే బాలకృష్ణన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు ఏఎం మునిరత్నం, చంద్రశేఖర్, ఎంపీలు విజయ్ వసంత్, సుధా, మాజీ ఎంపీ పీటర్ అల్ఫోన్స్, ఏఐసీసీ సభ్యుడు ఎన్ రంగభాష్యం, విల్లివాక్కం టి.సురేష్, కె.చిరంజీవి, ఎస్ఏ వాసు, తదితరులు పాల్గొని దివంగత నేతలకు ఘన నివాళులర్పించారు.

మన్మోహన్, ఇళంగోవన్ మృతికి అసెంబ్లీలో సంతాప తీర్మానాలు


సభలో సంతాపం తెలుపుతున్న స్పీకర్, సీఎం తదితరులు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఈరోడ్ ఈస్ట్ కాంగ్రెస్ శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతికి స్పీకర్ అప్పావు సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ యేడాది శాసనసభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 9.30 గంటలకు స్పీకర్ అప్పావు తిరుక్కురళ్ సూక్తిని పఠించిన తర్వాత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఈరోడ్ ఈస్ట్ కాంగ్రెస్ శాసనసభ్యులు ఈవీకేఎస్ ఇలంగోవన్ మృతికి సంతాప తీర్మానాలు చేశారు. ఆ సందర్భంగా మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను స్పీకర్ అప్పావు ప్రస్తావించారు. ఈవీకేఎస్ ఇళంగోవన్ ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఆ తర్వాత వీరిద్దరి మృతికి సంతాపం తెలుపుతూ శాసనసభ్యులందరూ లేచి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆ తర్వాత శాసనసభ వాయిదా పడింది. బుధవారం నుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై అన్ని పార్టీల సభ్యులు చర్చలు జరపనున్నారు.

5న ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ నియోజకవర్గం శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతి చెందటంతో ఈ ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఆ నియోజవర్గం ఉప ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఈ నెల 10న ప్రారంభమవుతుంది. 17 నామినేషన్ల స్వీకరణ ముగియనుంది. 18న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 20న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. పోలింగ్ ఫిబ్రవరి 5న, ఓట్లలెక్కింపు ఫిబ్రవరి 8న జరుగుతాయని కేంద్ర ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ మళ్ళీ పోటీ చేయనుందని, త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తామని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తెలిపారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు

● ఆరోగ్యమంత్రి సుబ్రమణ్యం

● బహిరంగ ప్రదేశాల్లో మాస్కు తప్పనిసరి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చైనాలో కలకలం రేపుతున్న హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమో వైరస్) వ్యాప్తిపై రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. చైనాలో ప్రస్తుతం ఈ కొత్త వైరస్ వ్యాప్తి వల్ల చిన్నారులు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. దీంతో భారతదేశం సహా పలు దేశాలు ఈ వైరస్ ఏం ముప్పు తెచ్చి పెడుతోందోనని ఆందోళన చెందుతున్నాయన్నారు. ప్రస్తుతం భారతదేశంలోనూ ఈ వైరస్ ప్రవేశించింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. నగరంలోనూ ఇద్దరు చిన్నారులకు ఈ వైరస్ సోకిన లక్షణాలు ఉండటంతో గిండిలోని ప్రైవేటు చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చేర్చారు. ఇదే విధంగా చెట్‌పట్ ప్రైవేటు ఆస్పత్రిలోనూ ఓ చిన్నారి ఈ వైరస్ సోకిన లక్షణాలతో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో నగరంలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ... రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వైరస్ కోవిడ్‌లా తీవ్ర ప్రభావం చూపదన్నారు. ఈ వైరస్ గురించిన సమగ్రమైన సమాచారాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా పొందనున్నామని, ఆ తర్వాత వైరస్ వ్యాప్తి నిరోధక చర్యలను తీవ్రతరం చేయనున్నామని ఆయన చెప్పారు. ఈ వైరస్ సోకితే 3 నుంచి 5 రోజులపాటు జలుబు, దగ్గు ఉంటాయని, ఐదు రోజులపాటు ఐసోలేషన్‌లో ఉంటే త్వరగా కోలుకోవచ్చునని తెలిపారు. ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో అందరూ మాస్కులు ధరించాలని ప్రభుత్వం ప్రకటన చేసిందని మంత్రి చెప్పారు.

మాస్కు ధరించాలి..

రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ వ్యాప్తిని నిరోధించేందుకు బహిరంగ ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తప్పకుండా మాస్కులు ధరించాలని పేర్కొంది. ఇదే విధంగా పర్యాటక ప్రాంతమైన ఊటీలో పర్యాటకులు తప్పకుండా మాస్కులు ధరించి రావాలని అక్కడి అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది.

మళ్లీ వైరస్ టెన్షన్

రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా తీవ్రతరం

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకరమైన కరోనా వైరస్ పుట్టిన చైనా నుంచి తాజాగా 'హ్యూమన్ మెటాన్యూమో వైరస్' (హెచ్‌ఎంపీవీ) అనే వైరస్ భారతదేశంలో వ్యాప్తి చెందుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమౌతుంది. సోమవారం బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ఐదుగురు శిశువులు వైరస్ బారినపడినట్లు భారత వైద్య పరిశోధనా మండలి ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ప్రారంభంలోనే వైరస్‌ను అడ్డుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్ర సమీపంలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన హోసూర్‌లో మంగళవారం నుంచి నిఘా ఏర్పాటైంది. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు కృష్ణగిరి జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మరోవైపు జ్వరం, జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారిని ఆరోగ్య శాఖ అధికారులు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు హోసూర్ ప్రాంతంలో హెచ్‌ఎంపీవీ బాధితులు లేరని ప్రభుత్వ, ప్రవేటు ఆస్పత్రుల్లో జ్వరం పీడితులు మాత్రమే చికిత్స పొంది కోలుకున్నారని హోసూర్ కార్పొరేషన్ ఆరోగ్య శాఖ అధికారి రజిత పేర్కొన్నారు.


ఆందోళన చేపడుతున్న రైతులు

'టంగ్‌స్టన్'కు వ్యతిరేకంగా రైతుల పాదయాత్ర

● భారీగా తరలివచ్చిన మద్దతుదారులు

● ట్రాఫిక్‌కు అంతరాయం

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరులో కేంద్రప్రభుత్వం చేపట్టదలచిన టంగ్‌స్టన్ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేయాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా, మంగళవారం 15 గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు కలిసి 15 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. ఇందులో 30కి పైగా గ్రామాల ప్రజలు, వ్యవసాయదారులు పాల్గొన్నారు. ఈ పాదయాత్ర కారణంగా చిట్టంపట్టి టోల్‌ప్లాజా నుంచి తల్లాకుప్పం వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మదురై జిల్లా మేలూరు సమీపంలో అరిట్టాపట్టి నాయక్కర్‌పట్టి, అ.వల్లాలపట్టి సహా పరిసర గ్రామాల పరిధిలో టంగ్‌స్టన్ ఖనిజ గనుల తవ్వకాలు జరిపేందుకు హిందుస్థాన్ జింక్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆందోళనలో అన్ని రాజకీయ పార్టీల నేతలు కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మంగళవారం రైతులు, మేలూరు నియోజకవర్గ ప్రజలంతా కలిసి మదురై, తిరుచ్చి జాతీయ రహదారిలో చిట్టంపట్టి టోల్‌గేట్ నుంచి సుమారు 15 కిలోమీటర్ల వరకు పాదయాత్రగా వెళ్ళి తాళ్ళకుళం సెంట్రల్ పోస్టాఫీస్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం చిట్టంపట్టి టోల్‌ప్లాజా వద్దకు వేలాదిమంది చేరుకున్నారు. జిల్లా ఎస్పీ అరవింద్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. పాదయాత్రగా వెళ్లొద్దని, వాహనాల్లో సెంట్రల్ పోస్టాఫీస్ వద్దకు వెళ్ళి వినతిపత్రం ఇవ్వాలని సూచించారు.



అయితే, ఆందోళనకారులు పాదయాత్ర చేసేందుకు ముగ్గు చూపారు. దీంతో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు వద్దన్నా రైతులు, ప్రజలంతా కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర తల్లాకులం సెంట్రల్ పోస్టాఫీస్ వరకు నిర్వహించి, టంగ్‌స్టన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనకారణంగా మదురై హైకోర్టుతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు కల్పించింది.

గవర్నర్‌ను రీకాల్ చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ధర్నా

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదువకుండా వాకౌట్ చేసి, రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్‌ను రీకాల్‌చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మూడేళ్లుగా శాసనసభను కళంకపరుస్తున్న గవర్నర్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. గవర్నర్ తీరును ఖండిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకో జరపాలని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి కార్యదర్శి ఆర్ఎస్ భారతి పిలుపునిచ్చారు. ఆ మేరకు చెన్నై సైదాపేట పానగల్ మాళిగ వద్ద డీఎంకే ఎంపీ కనిమొళి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్ఎస్ భారతి, ఎంపీ దయానిధి మారన్, డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అందియూరు సెల్వరాజ్, పార్టీ జిల్లా నేతలు ఆర్డీ శేఖర్, మాధవరం ఎస్.సుదర్శనం, సిట్రరసు, తంగవేలు, రాజ్యసభ్యుడు గిరిరాజన్, ఎమ్మెల్యేలు ఐడ్రీమ్ ఆర్.మూర్తి, కేపీ శంకర్, తాయగం కవి, పరంధామన్, ప్రభాకర్‌రాజా, అరవింద్‌రమేష్, ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆందోళనలో గవర్నర్‌ను రీకాల్ చేయాలని, ఈ గవర్నర్ మాకొద్దు! అంటూ నినాదాలు చేశారు.

పల్లావరంలో.. : పల్లావరం బస్‌స్టేషన్ సమీపంలో ఎమ్మెల్యే ఇ. కరుణానిధి నాయకత్వంలో ధర్నా జరిగింది. తాంబరం ఎమ్మెల్యే ఎస్ఆర్.రాజా, ద్రావిడ ఇయక్క తమిళ్‌పేరవై ప్రధాన కార్యదర్శి శుభవీరపాండ్యన్, చెంగల్పట్టు ఎమ్మెల్యే వరలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే వైద్యలింగం తాంబరం మేయర్ వసంతకుమారి, డిప్యూటీ మేయర్ కామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోవైలో... : కోయంబత్తూరులో 'గెట్‌అవుట్ రవి' అనే నినాదాలతో డీఎంకే శ్రేణులు రాస్తారోకో జరిపారు. నగరంలోని టాటాపథ్ ప్రాంతంలో జరిగిన ఆందోళనకు జిల్లా కార్యదర్శి కార్తీక్ నాయకత్వం వహించారు. సీనియర్ నేత పొంగళూరు పళనిస్వామి తదితర నాయకులు పాల్గొన్నారు. ఇదే విధంగా తిరుప్పూరు, మదురై, తిరుచ్చి, రామనాథపురం, కడలూరు, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, కృష్ణగిరి, ధర్మపురం జిల్లాల్లోనూ డీఎంకే జిల్లా శాఖల ఆధ్వర్యంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా ధర్నా, రాస్తారోకో జరిగాయి.


ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు - కోవైలో గెట్అవుట్ రవి అనే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్యకర్తలు(ఇన్‌సెట్లో)


సైదాపేట ధర్నాలో ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్ తదితరులు

సమాచార దృశ్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చెన్నై, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల కారణంగా ఈ దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న విద్యుత్ బోర్డ్ అధికారులు ప్రకటించారు. ఎంకేబీ నగర్, తిరుముడివాక్కం ఇండస్ట్రియల్ ఎస్టేట్, కళ్యాణపురి వీధి, మంగళపురి, ఉమెన్ ఇండస్ట్రియల్ పార్కు, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, మైక్రో ఎస్టేట్, పెరుమాళ్‌నగర్, శ్రీకృష్ణానగర్, దోషి, కాసా గ్రాండ్, పామ్ రివేరా, తరమణి ఏరియా, కన్నకం, పెరియార్ నగర్, తిరువాన్మియూరు, ఇందిరా నగర్ ఏరియా, ఎంజీఆర్ నగర్, వేళచ్చేరి ప్రాంతం, విఎస్ఐ సెయింట్ ఫేస్-1, 100 అడుగుల రోడ్డు ప్రాంతం, అన్నానగర్, సీఎస్ఆర్ రోడ్డు, ఆర్ఎంఎస్, సీపీటీ పీటీ, గాంధీ నగర్.

చెన్నై, మదురై, పొల్లాచ్చిలో 10న బెలూన్ ఫెస్టివల్

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 10న చెన్నై, మదురై, పొల్లాచ్చి నగరాల్లో అంతర్జాతీయ బెలూన్ల పండుగ నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో గత తొమ్మిదేళ్లుగా ఈ బెలూన్ ఫెస్టివల్ జరుపుతున్నామని చెప్పారు. చెన్నై సమీపంలో కోవళం సమీపం తిరువిడైందైలో ఈ నెల 10 నుంచి 12 వరకు, పొల్లాచ్చి ఆచ్చిపట్టిలో 14 నుంచి 16 వరకు, మదురై జిల్లా అలంగానల్లూరు కీళ్‌కరై కలైంజర్ శతజయంతి స్మారక జల్లికట్టు మైదానంలో 18 నుంచి 18వరకు ఈ బెలూన్ ఫెస్టివల్ జరుగనున్నారు. మదురైలో ఈ వేడుకలు తొలిసారిగా జరుగనున్నాయి. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా, బ్రెజిల్, బెల్జియం, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాలకు చెందిన హాట్ ఎయిర్ బెలూన్లను ఎగురవేయనున్నట్లు తెలిపారు.

రామనాథపురంలో 8 రోజుల పొంగల్ సెలవులు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో పొంగల్ సెలవులతో పాటు మొత్తం 8 రోజులు సెలవుదినాలుగా ఆ జిల్లా అధికారులు ప్రకటించారు. ఆ జిల్లాలోని మరకత నటరాజస్వామి కొలువుదీరిన ఉత్తరకోశమంగై మంగళనాథర్ ఆలయంలో ఆరుద్రదర్శన వేడుకలు ఈ నెల 13న జరుగనున్న సందర్భంగా ఆ రోజును స్థానిక సెలవు ప్రకటించారు. దీంతో ఆ జిల్లావాసులకు పొంగల్ సెలవులతోపాటు ఈ నెల 12 నుండి 19 వరకు అంటే ఎనిమిది రోజులు వరుగా సెలవుదినాలవుతాయని పేర్కొన్నారు.

పసుపు మార్కెట్‌కు 9 రోజుల సెలవు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశ, విదేశాలకు పసుపు ఎగుమతి చేసే ఈరోడ్ పసుపు మార్కెట్‌కు 9 రోజులు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఈరోడ్ ప్రాంతంలోనే అత్యధికంగా పసుపు సాగు చేస్తున్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పసుపును పెరుంతురై సమీపం కరుమాండిచెల్లిపాళయం మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13 నుండి 17 వరకు ఆ పసుపు మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. ఈ నెల 11, 12 తేదీలు, 18, 19 తేదీలు శని, ఆదివారాలు కావటంతో ఆ నాలుగు వారాంతపు సెలవులు కలుపుకుంటే మొత్తం 9 రోజులు ఆ మార్కెట్ మూతపడుతుందని మార్కెట్ అధికారులు ప్రకటించారు.

పొంగల్ సందర్భంగా పడవ సవారీ వేళల పొడిగింపు

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సెలవుల సందర్భంగా పర్యాటకుల సౌకర్యార్థం పడవ సవారీ వేళలు పొడిగించినట్లు పుంపుహార్ సంస్థ ప్రకటించింది. కన్నియాకుమారి జిల్లాకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం పుంపుహార్ సంస్థ వివేకానంద రాక్‌కు పడవలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, పొంగల్ పండుగ సందర్భంగా ఈ నెల 15,16,17 తేదీల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పడవ సవారీ అందుబాటులో ఉంటుందని పుంపుహార్ సంస్థ తెలిపింది.

పర్యాటకులకు మాస్క్ తప్పనిసరి

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాకు వచ్చే పర్యాటకులు తప్పకుండా మాస్క్ ధరించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య విజ్ఞప్తి చేశారు. జిల్లా సమీపంలోఇన కర్ణాటక రాష్ట్రంలో ఇద్దరికి హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. ఈ విషయమై మంగళవారం జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య మీడియాతో మాట్లాడుతూ... కర్ణాటక రాష్ట్రంలో ఇద్దరికి కొత్త రకం వైరస్ లక్షణాలు నిర్ధారణ అయిన నేపథ్యంలో, కర్ణాటక, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న నీలగిరి జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న చెక్‌పోస్ట్‌ల్లో ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాకు వచ్చే పర్యాటకులపై ఎలాంటి నిషేధం లేదని, కానీ ముందు జాగ్రత్తగా పర్యాటకులు మాస్క్ ధరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విమానాల రాకపోకలకు అంతరాయం

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా మంచు అధికంగా కురుస్తోంది. ఈ కారణంగా ఆయా రాష్ట్రాల నుంచి చెన్నై వచ్చే విమానాల్లో జాప్యం జరుగుతోంది. చెన్నై నుంచి కోల్‌కత్తా వెళ్లే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సుమారు 5 గంటలు, పూనే వెళ్లాల్సిన ఇండిగో విమానం 3 గంటలు సహా పలు నగరాలకు వెళ్లాల్సిన 20కి పైగా విమానాలు ఆలస్యంగా బయల్దేరాయి. అదే సమయంలో ఆయా నగరాల నుంచి విమానాలు బయల్దేరే సమయం స్థానిక విమానాశ్రయ అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పలువురు ప్రయాణికులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు.

వేలూరు ఎంపీ కాలేజీలో మళ్లీ ఐటీ దాడులు

వేలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేలూరులో డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్ కళాశాలలో మరోసారి ఐటీ దాడులు జరిగాయి. కొద్ది నెలల క్రితం చెన్నై, వేలూరు నుంచి వచ్చిన ఐటీ అధికారులు కాట్పాడి గాంధీనగర్‌లో ఉన్న కదిర్ ఆనంద్ నివాసం, కాట్పాడి క్రిస్టియన్‌పేటలో ఉన్న కింగ్‌స్టన్ కళాశాల తదితర ప్రాంతాల్లో తనిఖీ చేసి ముఖ్యమైన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. 2019వ సంవత్సరంలో జరిగిన ఎంపీ ఎన్నికల్లో కాట్పాడి నియోజకవర్గం నుంచి కదిర్ ఆనంద్ పోటీ చేశారు. అదే సంవత్సరం మార్చి 30న కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎంకే నాయకులు పూంజోలై శ్రీనివాసన్, దామోదరన్ ఇళ్లలో ఐటీ అధికారులు తనిఖీ చేసి సుమారు రూ.11.6కోట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ కొనసాగింపులో భాగంగా మళ్లీ ఈ దాడులు జరిపినట్లు ఐటీ అధికారులు తెలిపారు.

కింగ్‌స్టన్ కళాశాల ముందు పోలీసు బందోబస్తు



రేపు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయం విశ్వవిద్యాలయ సమాచార, శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై ఈ నెల 9న ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. గిండి తిరువిక సిప్కాట్, సిపెట్ కాలేజ్ ఎదురుగా ఈ కేంద్రంలో జరిగే శిక్షణకు ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చు. అలాగే, 10వ తేది 'బ్రౌనీ' తయారీ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 044-29530048 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవచ్చు.

ప్రజల దృష్టి మరల్చేందుకే డీఎంకే ధర్నా

● ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్

ప్యారీస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతల సమస్య దారి మళ్లించేందుకే డీఎంకే మంగళవారం ధర్నా నిర్వహించిందని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. మంగళవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ధర్నా పేరుతో నాటకమాడిందని విమర్శించారు.

స్వర్ణాలయంలో భక్తులకు అన్నదానం



నారాయణి పీఠం స్వర్ణాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

వేలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని తిరుమలై కోటి నారాయణి పీఠంలో 3వ తేదీ శక్తి అమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఈ సందర్భంగా శ్రీపురం స్వర్ణాలయాన్ని దర్శించుకునే భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయొద్దు

పెరంబూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భోగీ మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయరాదని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రజలకు విజ్ఞప్తి చేసింది. భోగీ పండుగ సందర్భంగా ప్రజలు మంటల్లో ఇంట్లోని పాత బట్టలతో పాటు చుట్టుపక్కల ఉండే వ్యర్థాలు కూడా వేస్తుంటారు. ఇలాంటి వ్యర్థాలు వేసే పొగతో పర్యావరణానికి అంతరాయం కలుగుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ క్రమంలో, భోగీ పండుగ సందర్భంగా ప్రజలు, ప్లాస్టిక్, టైర్లు, రబ్బరు ట్యూబ్‌లు, తదితరాలకు వేయరాదని, పర్యావరణ హాని కలిగించకుండా పండుగ జరుపుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

నేడు తిరుమూర్తి డ్యామ్ నుంచి సాగునీరు విడుదల



చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా తిరుమూర్తి జలాశయం నుండి బుధవారం సాగునీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఆ జలాశయం నుంచి పది రోజలపాటు అంటే ఈ నెల 18వరకు రోజా 240 మిలియన్ల ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఈ జలాల ద్వారా కాంగేయం తాలూకాలోని 6043 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూముల్లో రైతులు పంటలు సాగుచేయనున్నారు.

వెయ్యెకరాల్లో తేయాకు పంటలు ధ్వంసం

ఐసిఎఫ్, జనవరి7(ఆంధ్రజ్యోతి):శీతాకాలంలో కురుస్తున్న మంచు కారణంగా తేయాకు పండించే రైతులకు శాపంగా మారింది. నీలగిరి జిల్లాలో ఈఏడాది అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో, మంచు ఎక్కువగా కురుస్తోంది.కున్నూరు, కిలింజడ, కుర్పాలం, కొందల, కొలకొంబై ప్రాంతాల్లో రైతులకు ప్రధాన పంటగా ఉన్న తేయాకు సుమారు వెయ్యెకరాల్లో ఆకు రాలిపోవడం తదితర కారణాలతో రైతులకు లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.

గవర్నర్‌కు వ్యతిరేకంగా ఈరోడ్‌లో పోస్టర్లు

● చర్చనీయాంశంగా మారిన వైనం

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారశైలిఇ నిరసనగా జిల్లా కేంద్రమైన ఈరోడ్‌లో పోస్టర్లు వెలిశాయి. ఇవి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కొత్త యేడాదిలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల ప్రారంభ ప్రసంగం చేసేందుకు అసెంబ్లీకి వచ్చిన గవర్నర్.. సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు జాతీయ గీతం ఆలపించలేదని ఆరోపిస్తూ సభ నుంచి అర్థాంతరంగా నిష్క్రమించారు. గవర్నర్ చర్య చిన్నపిల్లల తరహాగా, నవ్వు తెప్పించే విధంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు డీఎంకే కూటమికి చెందిన రాజకీయ పార్టీల నేతలు వ్యాఖ్యానించారు. అలాగే, అధికార డీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో గవర్నర్ వైఖరిని ఖండిస్తూ ఈరోడ్ నగరంలో వాల్‌పోస్టర్లు అంటించారు. వీటిలో గెటౌట్ రవి అంటూ ముద్రించారు. 'రాష్ట్రంలో హద్దుమీరుతున్న గవర్నర్, ఆయన్ను రక్షిస్తున్న అన్నాడీఎంకే - బీజేపీ కూటమి' అంటూ ముద్రించి మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, గవర్నర్ ఆర్ఎన్ రవి కలిసి మాట్లాడుతున్నట్లుగా ఉండేలా ఫొటోలను ముద్రించారు. ఈ పోస్టర్లు ఇపుడు చర్చనీయాంశంగా మారాయి.

యూజీసీ నెట్ వాయిదా వేయండి

సీఎం స్టాలిన్ డిమాండ్

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యూజీసీ నెట్ పరీక్షల నిర్వహణను సంక్రాంతి పండుగ సెలవు దినాలకు బదులుగా మరో తేదీలకు వాయిదా వేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఓ లేఖ రాశారు. జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్టీయే) గత డిసెంబర్ 19న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం యూజీసీ-నెట్ డిసెంబర్ 2024 పరీక్షలు ఈ యేడాది జనవరి 3 నుండి సంక్రాంతి సెలవుదినమైన 14తో కలుపుకుని 16వ తేదీ వరకు జరుగుతాయని ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. కొత్త యేడాది రైతులతోసహా తమిళ ప్రజలంతా ఘనంగా జరుపుకునే సంక్రాంతి పండుగ రోజైన ఈ నెల 14న ఈ పరీక్ష జరుపటం భావ్యం కాదని తెలిపారు. ఈ విషయాన్ని ఇదివరకే రాష్ట్ర ఉన్నత విద్యాశాఖమంత్రి కేంద్రానికి ఇదివరకే లేఖ రాశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ నెల 13న భోగి, 16 వరకు, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజానీకం వరుసగా ఘనంగా జరుపుకుంటుందని, ఈ పరిస్థితులలో యూజీసీ నెట్ పరీక్షలను ఈ తేదీలలో నిర్వహించకుండా ఇతర తేదీలలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే చార్టెడ్ అకౌంట్స్ ఫౌండేషన్ పరీక్షలను సంక్రాంతి సెలవుదినాలకు బదులుగా ఇతర తేదీలకు వాయిదా వేసిన సంగతిని స్టాలిన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ కేసులో బాంబు ఎలా వచ్చింది?

● పోలీసు శాఖ నివేదిక కోరిన హైకోర్టు

ప్యారీస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ కేసులో ఉపయోగించిన బాంబు కోర్టు ప్రాంగణంలోకి ఎలా వచ్చిందో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులకు మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు సంబంధించి అరెస్టు చేసిన 26 మందిలో 11 మంది నింధితులపై ప్రమోగించిన గూండా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ, వారి తరుపున హైకోర్ట్‌లో పిటీషన్ దాఖలైంది. మంగళవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, ఎం.జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరుపున హాజరైన న్యాయవాధి కుమరేశన్ గూండా చట్టాన్ని రద్దు చేయాలన్న కోరికను తిరస్కరించాలని ధర్మాసనం ముందు వాదించారు. అలాగే పిటిషనర్ల తరుపున హాజరైన న్యాయవాదులు హమీద్ ఇస్మాయిల్, ముత్తమిళ్ సెల్వకుమార్లు ఆంస్ట్రాంగ్ కేసు విచారణ త్వరితగతిన ముగించేలా న్యాయస్థానం పరిశీలించాలని కోరారు. ఇరు తరపు వాదనల అనంతరం హైకోర్టు ధర్మాసనం ఆమ్‌స్ట్రాంగ్ హత్యలో వాడిన బాంబు హైకోర్టు ప్రాంగణంలోకి ఎలా వచ్చిందన్న దానిపై విచారణ జరిపి నివేదిక దాఖలు చేయవల్సిందిగా సంబంధిత పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసి, ఈ కేసు తుది విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు.

రాష్ట్రంలో ఏఐ ఆధారిత విద్యుత్ వినియోగం

ప్యారీస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోజువారీ విద్యుత్ వినియోగాన్ని లెక్కించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ పరిశీలిస్తోంది. దీని ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గుతాయని, అలాగే విద్యుత్ వ్యయాన్ని అంచనా వేసేందుకు బోర్డుకు కూడా సహాయపడుతుందని అంటున్నారు. విద్యుత్ వినియోగం ఉదయం 6 గంటల నుండి నుండి రాత్రి 9 గంటల దాకా సగటుగా 16 వేల మెగావాట్లుండగా, అది పండుగ సమయాల్లో 21 వేల మెగావాట్లకు పెరిగి ఖర్చులు అధికమవుతుందన్నారు. ఆ పరిమితికి తగ్గట్టుగా పవర్ ప్లాంట్లలోని విద్యుత్ ఉత్పత్తి సరిపోవడం లేదు. ఈ క్రమంలో సెంట్రల్ పూల్, ప్రవేటు సంస్థల ద్వారా విద్యుత్‌ను కొంతమేరకు సేకరించాల్సివుంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ లెక్కించడానికి, ఉత్పత్తి నిర్వహణకై ఏఐ సాంకేతికతను ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులు భావిస్తున్నారు. దీని ద్వారా ఏడాదిలో ఎంత విద్యుత్ ఉత్పత్తి కావాలనేది ముందుగానే అంచనా వేసి నిల్వలు పెంచుకోవచ్చని తెలిపారు. దీని వల్ల విద్యుత్ బోర్డుకు భద్రతతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని బోర్డు అధికారులు అన్నారు.

పంచాయతీ విలీనంపై గ్రామస్తుల నిరసన



రోడ్డుపై బైఠాయించిన మహిళలు


తిరుత్తణి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పంచాయతీలో తమ గ్రామ పంచాయతీ విలీనాన్ని నిరసిస్తూ మహిళలు రాస్తారోకో చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీల సమీపంలో అభివృద్ధి చెందిన గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకిస్తూ పలు పంచాయతీలకు చెందిన ప్రజలు వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. తిరువళ్లూర్ జిల్లాలో పళ్లిపట్టు పట్టణ పంచాయతీలో రామచంద్రాపురం పంచాయతీ విలీనం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ రామచంద్రాపురం పంచాయతీకి చెందిన సుమారు 200 మంది మహిళలు మంగళవారం ఉదయం షోలింగర్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శివకుమార్, బీడీవో అర్పుదరాజ్, డీఎస్పీ కందన్ అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో సంప్రదించారు. పంచాయతీల విలీనం ప్రజాభిప్రాయం సేకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ సమయంలో మీరు అభిప్రాయాలు తెలపాలని అధికారులు కోరడంతో, వారు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

వినియోగదారుల అవసరాలు తీర్చడమే లక్ష్యం

● కాళీఎరేటెడ్ వాటర్ వర్క్స్ ఎండీ రమేష్

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా తమ సేవలను విస్తృతం చేస్తున్నట్లు కాళీఎరేటెడ్ వాటర్ వర్క్స్ ఎండీ జె.రమేష్ పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లడుతూ, తమ సంస్థ బొవెంటో - కాలిమార్క్ జ్యూస్, పప్పు ఉత్పత్తులతో పోర్టు ఫోలియో విస్తృతం చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ప్రీమియం గ్రేడ్ పప్పు దినుసులతో పాటు మామిడి, ఆపిల్, చిల్లీ, జామ జ్యూస్‌లను కాళీమార్క్ బ్రాండ్‌తో మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపారు. బలమైన నెట్‌వర్క్, అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో, కస్టమర్ల అంచనాలను అందుకోవడంలో, నాణ్యమైన ఉత్పత్తులను అందించి ప్రజల అవసరాలను తీర్చడంలో ముందుంటామని రమేష్ తెలిపారు.

గత ఏడాది మీనంబాక్కంలో రూ.175 కోట్ల బంగారం స్వాధీనం



పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయంలో గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.175 కోట్ల విలువైన 258 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి బంగారం అక్రమంగా తరలిస్తున్న ఘటనలు అధికమవుతున్నాయి. అందుకోసం కొందరు సిండికేట్‌గా ఏర్పడి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. మలేసియా, సింగపూర్, బ్యాంకాక్, షార్జా, అబుదాబి సహా పలు దేశాల నుంచి బంగారం అక్రమ రవాణా సాగుతోంది. ఈ అక్రమ రవాణాను అరికట్టేందుకు విమానాశ్రయంలో గస్తీ ముమ్మరం చేశారు. ఆ ప్రకారం 2023వ జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.218 కోట్ల విలువైన 303 కిలోల బంగారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం గత ఏడాది బంగారం, వెండిపై విధించే కస్టమ్స్ పన్ను 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. దీని కారణంగా బంగారం అక్రమ రవాణా కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.175 కోట్ల విలువైన 258 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2023తో పోల్చితే 2024లో బంగారం అక్రమ రవాణా తగ్గింది. కాగా, గత ఏడాది బంగారం అక్రమ రవాణాకు సంబంధించి 575 మందిని అరెస్ట్ చేసినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

జ్యూస్‌లో విషం కలుపుకుని తల్లీకొడుకుల ఆత్మహత్య

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేని ఓ తల్లీ కొడుకు జ్యూస్‌లో విషం కలుపుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన కన్నియాకుమారి జిల్లా తక్కలై సమీపంలోని మరైక్కాడు అనే గ్రామంలో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన తంగరాజ్ (60), అముద లత (50) అనే దంపతులకు సుమారాణి, మెల్విన్ రాజ్ (23) అనే ఇద్దరు పిల్లలున్నారు. అయితే, సుమారాణికి పెళ్ళి చేసేందుకు, ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రుణం తీసుకున్నారు. కొంతమేరకు రుణం చెల్లించినప్పటికీ ఇంకా రూ.20 లక్షల వరకు ఉండిపోయింది. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుణం చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది ఒత్తిడి చేయసాగారు. పైగా ఎంతో ఇష్టపడి నిర్మించుకున్న ఇంటిని విక్రయించేందుకు వారికి మనసురాలేదు. దీంతో మానసికంగా కుంగిపోయిన అముదలత, మెల్విన్ రాజ్ ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయం తీసుకుని జ్యూస్‌లో విషం కలుపుకుని సేవించడంతో వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ జరుపుతున్నారు.

లైంగిక ఫిర్యాదులపై తక్షణ చర్యలు

● ఐజీ వి.బాలకృష్ణన్

ప్యారీస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాలను దృష్టిలో ఉంచుకుని, ఇక నుండి లైంగిక నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోనున్నట్లు జోనల్ ఐజీ వి.బాలకృష్ణన్ తెలిపారు. ఈ క్రమంలో లైంగిక నేరాలపై ఫిర్యాదు అందిన 30 నిమిషాల్లోపు స్థానిక పోలీసు అధికారులు సంఘటనా స్థలంలో ఉండాని ఆయన ఆదేశించారు. అదే విధంగా పోలీసు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు పోలీసులు వీలైనంత త్వరగా లోకేషన్‌కు చేరుకుని మహిళలు, పిల్లలను రక్షించాలని ఐజీ సూచించారు. ఫిర్యాదు స్వీకరించిన 24 గంటల్లోపు ఎఫ్ఐఆర్ నివేదిక దాఖలు చేయాలని,. ఇందులో పోలీసులు ఎలాంటి జాప్యం చేయకూడదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు కూడా తీసుకుంటామని ఐజీ అన్నారు.

లైంగిక వేధింపుల ఆరోపణ

● మాజీ రిజిస్ట్రార్‌కు హైకోర్టు నోటీసులు

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ విచారణకు హాజరుకావాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. లైంగిక వేధింపుల కేసులో ముందస్తు బెయిలు కోరుతూ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ రామకృష్ణన్ పెట్టిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఈ కేసులో పోలీసుల విచారణ ముఖ్యమైనందని, మాజీ రిజిస్ట్రార్ రామకృష్ణన్ స్వయంగా పోలీసు విచారణకు హాజరుకావాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

మన్సూర్ అలీఖాన్ కుమారుడికి బెయిల్

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ కుమారుడు తుగ్లక్ అలీఖాన్‌కు గంజాయి విక్రయ కేసులో మద్రాస్ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత యేడాది డిసెంబరు 4వ తేదీ గంజాయి విక్రయ కేసులో తుగ్లక్‌ను నగర పోలీసులు అరెస్టు చేశారు. తన స్నేహితులతో కలిసి గంజాయి విక్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం మాదకద్రవ్య అక్రమ రవాణా నిరోధక కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, చుక్కెదురైంది. దీంతో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి ఏడీ జగదీష్ చంద్ర సమక్షంలో విచారణకు రాగా, ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. అలాగే, ప్రతి రోజూ జేజే నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సంతకం చేయాలని ఆదేశించారు.

మెకానిక్‌పై ఎస్ఐ దాడి

● సస్పెండ్ చేసిన అధికారులు

ప్యారీస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మదురైలోని ఓ మెకానిక్ షాపులో మెకానిక్‌పై దాడికి యత్నించిన ఎస్ఐని అధికారులు సస్పెండ్ చేశారు. నీలకోట్టై ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ మదురై జిల్లా వడిపట్టిలో బైక్ సర్వీస్ పాయింట్ నడుపుతున్నాడు. ఆ క్రమంలో సోమవారం ఉదయం ఎస్ఐ సురేష్ తన బుల్లెట్ బైక్‌ను ఆ సర్వీస్ పాయింట్‌లో మరమ్మతు చేయించుకుని డబ్బులివ్వలేదు. మెకానిక్ శ్రీనివాసన్ డబ్బులడిగినప్పుడు అతడిపై దాడి జరిపాడు. దానికి సంబంధించిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియా వెలువడింది. ఈ విషయంపై జిల్లా ఎస్పీ విచారణ జరిపి ఎస్ఐ సురేష్‌ను సస్పెండ్ చేశారు.

బైక్ ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

ఐసిఎఫ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బైక్ ప్రమాదంలో అన్నదమ్ములు మృతిచెందిన ఘటన ఒట్టాన్‌ఛత్రం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఒట్టాన్‌సత్రం మార్కంపట్టికి చెందిన మహమ్మద్ అనీస్ (27), అతని అన్న షేక్ మహమ్మద్ (38) సోమవారం తమ ద్విచక్రవాహనంపై ఒట్టాన్‌సత్రం వైపు వెళ్తుండగా, ఐడన్‌సంతూర్ రోడ్డు వివేకానంద పాఠశాల సమీపంలో అదే మార్గంలో అయలూరు ప్రాంతానికి చెందిన శక్తి అనే వ్యక్తి మినీ లారీతో బైక్‌ను ఢీకొనడంతో, అనీస్ ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మహమ్మద్ తీవ్రగాయాలతో కోవై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గణపతి ఆలయంలో విగ్రహాల చోరీ

ఐసిఎఫ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్ కృష్ణాపురం పాకూర్ వీధిలో ని వినాయకుడి ఆలయంలో చోరీ జరిగింది. ఈ దేవాలయంలో సోమవారం రాత్రి పూజల అనంతరం ఆలయ అర్చకులు తలుపులకు తాళం వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు ప్రధాన తలుపుల తాళం బద్దలుకొట్టి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఆలయంలోకి వెళ్లి చూడగా, గర్భగుడిలోని రెండడుగుల వినాయకుడి విగ్రహం, అరడుగు మురుగన్ విగ్రహం అదృశ్యం కావడం, ఆలయ హుండీ పగులగొట్టి ఉండడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, నెల వ్యవధిలో ఈ ఆలయంలో రెండో సారి చోరీ జరగడం స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల వెళ్తుండగా ప్రమాదం

● భర్త మృతి, భార్యాపిల్లలకు గాయాలు

తిరుత్తణి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన విషాదం నింపింది. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌కుచెందిన సుధాకర్ (48), భార్య గోదైనాయకి, 19 ఏళ్ల కుమారుడు, కుమార్తె దర్శిని (18)తో కలసి కారులో తిరుమలకు బయల్దేరారు. తిరుత్తణి సమీపం చెన్నై-తిరుపతి జాతీయ రహదారి తిరువలంగాడు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో వీరి కారును చెరకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందగా, భార్య, కుమారుడు, కుమార్తెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, క్షతగాత్రులు అంబులెన్స్ ద్వారా తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

16 కేజీల గంజాయి స్వాధీనం

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మణలి పుదునగర్‌లోని టీ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పుదునగర్‌లో నిషేధిత మాదకద్రవ్యాల విక్రయం జరుగుతున్నట్లు డ్రగ్ కంట్రోల్ విభాగానికి సమాచారం వచ్చింది. దీంతో ప్రత్యేక పోలీసుల బృందం ఆ ప్రాంతంలోకి దుకాణాలను తనిఖీ చేయగా ఓ టీ దుకాణంలో రహస్యంగా నిల్వవుంచిన 16 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి టీ దుకాణం యజమాని మురుగన్ ను అరెస్టు చేశారు.

ఎంపీ రాజా వ్యాఖ్యలను ఖండించిన సీపీఎం

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్ట్ నేతలు స్వార్థపరులుగా మారారని విమర్శించిన డీఎంకే ఎంపీ ఏ.రాజా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. స్థానిక అరంబాక్కంలోని పచ్చయప్పన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డీఎంకే ఎంపీ రాజా ప్రసంగిస్తూ తమ కమ్యూనిజం సిద్ధాంతాలు కనుమరుగయ్యాయని, కమ్యూనిస్ట్ నేతలు స్వార్థపరులుగా మారారని విమర్శలు గుప్పించారు. దీనిపై స్పందించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షన్ముగం మంగళవారం మీడియాతో మాట్లాడారు. కమ్యూనిస్ట్ నేతలు స్వార్థపరులని ఎంపీ ఎ.రాజా విమర్శించడం సరికాదన్నారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని సెక్యూలర్ కూటమి అభ్యర్థికి ఆయన మద్దతు ప్రకటించారు.

నిద్రలోనే కన్నుమూసిన చిన్నారి

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పళ్ళికరణిలో తల్లిపాలు తాగి నిద్రలోకి జారుకున్న ఓ ఆరునెలల పసికందు తీవ్ర అస్వస్థతకులోనై మరణించాడు. పోలీసుల కథనం మేరకు పళ్ళికరణి, మయిలై బాలాజీ నగర్‌కు చెందిన కలైవాణన్ (29) అనే ఆటో డ్రైవరుకు భార్య భవానీతో పాటు ఆరు నెలల సైలన్ అనే మగబిడ్డ ఉన్నాడు. సోమవారం ఉదయం బిడ్డకు తల్లి పాలు పట్టించింది. మధ్యాహ్నం 12 గంటలకు బయటకు వెళ్తూ కలైవాణన్ కుమారుడిని ముద్దాడేందుకు వెళ్ళగా ఎలాంటి చలనం లేకపోవడం గుర్తించి హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళారు. ఆ బిడ్డను పరిశీలించిన వైద్యులు, ఊపిరాడక చనిపోయినట్టు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మలయాళ చిత్రాల్లో మంచి కథాంశం • త్రిష



'ఐడెంటిటీ' విలేకరుల సమావేశంలో త్రిష, టోవినో, అఖిల్ తదితరులు

తనకు మలయాళ చిత్రాలంటే ఇష్టమని, ఆ చిత్రాల్లో మంచి కథాంశం ఉంటుందని హీరోయిన్ త్రిష అన్నారు. రాగం మూవీస్ బ్యానరుపై రాజు మల్లైయత్, కాన్ఫిడెంట్ గ్రూప్ సి.జె.రాయ్‌లు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఐడెంటిటీ'. అఖిల్ దర్శకుడు. తమిళం, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో టోవినో థామస్, త్రిష, వినయ్ రాయ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ నెల 2వ తేదీ విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వచ్చింది. దీంతో తమిళనాడులో థియేటర్ల సంఖ్య పెంచారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో హీరోయిన్ త్రిష పాల్గొని మాట్లాడుతూ, 'ఒక మలయాళ సినిమా కోసం మీడియా మిత్రులను కలుసుకోవడం ఇదే తొలిసారి. సహజంగానే మలయాళ భాషా చిత్రాల్లో మంచి కథాంశం ఉంటుంది. మహిళల పాత్ర బలంగా ఉంటుంది. అందుకే ఆ భాషా చిత్రాలంటే నాకు ఎంతో ఇష్టం. ఈ చిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు. దర్శకుడు అఖిల్ స్క్రీన్‌ప్లే చాలా బాగుంది. అతనితో కలిసి పనిచేయడం గొప్ప అనుభవంగా ఫీలవుతున్నాను. మూవీ విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల ఆదరణ బాగుంది' అన్నారు. నటుడు టోవినో థామస్ మాట్లాడుతూ, 'ఈ సినిమా సీరియస్‌గా ఉన్నప్పటికీ చాలా సరదాగా సాగిపోతుంది. తమిళంలో కూడా మంచి స్పందన రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని చిత్రాల్లో నటిస్తాను' అన్నారు. దర్శకుడు అఖిల్ మాట్లాడుతూ, 'మా చిత్రానికి తమిళనాడులో మంచి స్పందన రావడం సంతోషంగా ఉంది. రోజురోజుకూ వసూళ్ళు పెరుగుతున్నాయి. ఈ కథ, యాక్షన్ సన్నివేశాలు యేడాదిన్నరపాటు శ్రమించి తెరకెక్కించాం' అని పేర్కొన్నారు.



'డెక్స్టర్'లో రాజీవ్ గోవింద్, యుక్తా పెర్వి

మూడు భాషల్లో క్రైమ్ థ్రిల్లర్ 'డెక్స్టర్'

రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై ప్రకాష్.ఎస్‌వి నిర్మించిన చిత్రం 'డెక్స్టర్'. తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో రూపొందుతున్న ఈ మూవీని క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిస్తున్నారు. సూర్యన్.జి దర్శకత్వంలో రాజ్ గోవింద్, అభిషేక్ జార్జ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రంలో యుక్తా పెర్వి, సితార విజయన్ హీరోయిన్లుగా నటించారు. హరీష్ పేరడి, నటి అష్రాఫ్ మురుగన్, శోభా ప్రియ, బాలనటి బెహ్మాన్, పర్హాన్, జాన్వీ, సెనెగల్, ఆదిత్యన్ తదితరులు నటించారు. ఈ సినిమా వివరాలను నిర్మాత ప్రకాష్, దర్శకుడు సూర్యన్ వివరిస్తూ, 'సినిమాలో రెండు పోరాట సన్నివేశాలు, రెండు పాటలున్నాయి. కేజీఎఫ్, హోసూర్, కొడగు కొండ, వయనాడ్ తదితర ప్రాంతాల్లో 45 రోజుల్లో రెండు దశల్లో షూటింగ్ చేశాం. తుది దశ నిర్మాణంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఫిబ్రవరిలో విడుదల చేయాలని భావిస్తున్నాం. ఎంతో ఆసక్తికరంగా సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాం. ఇటీవలకాలంలో హర్రర్‌తో వచ్చిన 'రాక్షసన్', 'పోర్ తొళిల్' బాణీలోనే ఈ సినిమా ఉంటుంది' అని వివరించారు.



'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో అజిత్ కుమార్

ఏప్రిల్ 10 'గుడ్ బ్యాడ్ అగ్లీ' విడుదల

అజిత్ కుమార్ హీరోగా ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ఏప్రిల్ 10వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించింది. సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ చేస్తున్నారు. అజిత్, త్రిష, ప్రసన్న, సునీల్, అర్జున్‌దాస్ తదితరులు నటించారు. నిజానికి అజిత్ నటించిన 'విడాముయర్చి' చిత్రం పొంగల్‌కు విడుదలకావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల విడుదల వాయిదా వేశారు. దీంతో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాను ఏప్రిల్ 10వ తేదీ విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.కాగా,హీరో స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇడ్లీ కడై'సినిమాను కూడా ఏప్రిల్ 10వ తేదీనే విడుదల చేయనున్న విషయం తెల్సిందే.

తమిళ చిత్రజ్యోతి

కమల్ స్వదేశానికి వచ్చాక

'ఇండియన్-3' పంచాయితీ

అగ్రనటుడు కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇండియన్-3' విడుదలలో సమస్యలు తలెత్తాయి. నిర్మాణ సంస్థకు, దర్శకుడు, హీరోకు మధ్య వివాదం తలెత్తింది. ఈ పంచాయతీ పరిష్కారం పలువురు చూపించినప్పటికీ ఫలితం లభించలేదు. దీంతో కమల్ హాసన్ స్వదేశానికి వచ్చిన ఈ పంచాయితీకి ముగింపు పలకాలని భావిస్తున్నారు. లైకా ప్రొడక్షన్ నిర్మించిన 'ఇండియన్-2' చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఫలితంగా నిర్మాతకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో 'ఇండియన్-2'కు చెల్లించాల్సిన పారితోషికాన్ని దర్శకుడికి నిర్మాణ సంస్థ చెల్లించలేదనే టాక్. ఈ కారణంగా మూడో భాగం నిర్మాణ పనులను దర్శకుడు శంకర్ వదిలివేసి, తెలుగులో 'గేమ్ ఛేంజర్' తెరకెక్కించారు. అయితే, 'ఇండియన్-3' పూర్తి చేయకుండా 'గేమ్ ఛేంజర్'ను తమిళంలో విడుదల చేయడానికి వీల్లేదని లైకా నిర్మాణ సంస్థ ఓ కండిషన్ పెట్టినట్టు సమాచారం. అదేసమయంలో తనతో పాటు హీరోకు చెల్లించాల్సిన పారితోషికాన్ని లైకా నిర్మాణ సంస్థ చెల్లించాలని, అప్పటి వరకు 'ఇండియన్-3'ని థియేటర్ లేదా ఓటీటీలో విడుదల చేయడానికి వీల్లేదని దర్శకుడు శంకర్ షరతు విధించినట్టు సమాచారం. వీటిపై సినీ పెద్దలు వరుసగా చర్చలు జరుపుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కమల్ హాసన్ స్వదేశానికి వచ్చిన తర్వాత ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం ఇరు వర్గాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'గేమ్ ఛేంజర్' తమిళ వెర్షన్ విడుదలకు కూడా లైకా నిర్మాణ సంస్థ అడ్డు చెప్పలేదని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.



కమల్ హాసన్ - శంకర్

ప్రముఖ నిర్మాణ సంస్థపై ఐటీ దాడి



ఈరోడ్‌లోని నిర్మాణ సంస్థ భవనం

• ఒకే సమయంలో 26 చోట్ల తనిఖీలు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై, కోయంబత్తూరు నగరాల్లో ఈరోడ్‌కు చెందిన భవన నిర్మాణ సంస్థ 'ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్'కు చెందిన శాఖలు, కార్యాలయాలు సహా 26 చోట్ల మంగళవారం ఏకకాలంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈరోడ్ పూందురై రోడ్డులోని చెట్టిపాళయం వద్ద అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అనుచరుడైన రామలింగం ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఓ సంస్థ నడుపుతున్నారు. ఈ సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భవనాలను నిర్మిస్తోంది. అంతేకాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోనై ప్రభుత్వ భవనాల నిర్మాణాలను చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఈరోడ్‌లోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కోయంబత్తూరు నుండి వచ్చి ఐటీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రఘుపతినాయకన్ పాళయంలో ఉన్న సంస్థ నిర్వాహకుడి నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. ఆ ప్రాంతాల్లో బయటి వ్యక్తులు ప్రవేశించకుండా సాయుధ పోలీసులను కాపలాగా ఉంచారు. 2016లో పెద్ద నోట్ల రద్దు సందర్భంగా ఈ సంస్థ అక్రమ నగదు బట్వాడాకు పాల్పడినట్లు పలు కేసులు నమోదయ్యాయి. ఆ కేసులపై విచారణలో భాగంగా ఈ దాడులు జరిగాయి. చెన్నైలో తేనాంపేట, ఫ్లవర్‌బజార్, తిరువొత్తియూరు, సాత్తంగాడు తదితర ప్రాంతాల్లో 'జేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ మెటీరియల్' శాఖలలోనూ ఐటీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.



ఈరోడ్ కార్యాలయం



తిరువొత్తియూరులో ఐటీ దాడులు జరుగుతున్న కార్యాలయం వద్ద సాయుధ దళాల బందోబస్తు



చెన్నై కార్పొరేషన్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ ఆర్.ప్రియ

ఫిబ్రవరి నుంచి చెన్నై-మస్కట్ విమాన సేవలు

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విమానాశ్రయం నుంచి ఒమన్ రాజధాని మస్కట్‌కు నేరుగా విమాన సేవలు ఫిబ్రవరి 4వ తేది నుంచి ప్రారంభించనున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సంస్థ తెలిపింది. ఆ ప్రకారం, మంగళ, శుక్రవారాల్లో నగరం నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరే విమానం సాయంత్రం 4.10 గంటలకు మస్కట్ చేరుకుంటుంది. మస్కట్ నుంచి సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రాత్రి 10.40 గంటలకు నగరానికి చేరుకుంటుందని ఆ సంస్థ అధికారులు తెలిపారు.

ఘనంగా 'యువ సిద్ధి 2025'



కార్యక్రమంలో విద్యావేత్తలు

అడయార్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 'యువ సిద్ధి 2025' ఫ్లాగ్‌షిప్ ఈవెంట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడా, విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ (అకడమిక్ అండ్ ప్లేస్‌మెంట్స్) వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.గోమతి స్వాగతోపన్యాసం చేయడంతో పాటు అతిథులను స్వాగతం పలికారు. ఎఫ్ఈటీ డీన్ డాక్టర్ సీవీ విజయకుమార్ మాట్లాడుతూ, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో రాణించాలనే క్యాంపస్ కల సాకారం కావడంతో ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ క్యాంపస్‌కు చెందిన అనేక మంది విద్యార్థినీ విద్యార్థులు క్రీడా, విద్యా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ ర్యాంకులు సాధిస్తున్నారని పేర్కొన్నారు.

టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడికి కామరాజర్ అవార్డు




తంగబాలు (ఫైల్‌ఫొటో)

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలును కామరాజర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీధుల వెంబడి పాఠశాలలు, ఉచిత విద్య, పౌష్టికాహార పథకాన్ని అమలు చేసి తమిళ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ పేరుతో ప్రభుత్వం యేటా సేవాపరులకు ఆయన పేరుతో అవార్డులను ప్రదానం చేయడం ఆనవాయితీ. ఇప్పటివరకూ 18 మంది ప్రముఖులను ఈ అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో 2024 యేడాదికిగాను కేవీ తంగబాలును ఆ అవార్డుకు ఎంపిక చేసింది. ఏఐసీసీ సభ్యుడిగా, రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ నేతగా, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా, రెండుసార్లు ఎంపిగా తంగబాలు అందించిన నిస్వార్థ సేవలను గుర్తించి కామరాజర్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 15న నగరంలో నిర్వహించనున్న తిరువళ్లువర్ వేడుకలలో ఆయనకు ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద రూ.2లక్షల నగదు, 8 గ్రాముల స్వర్ణపతకం, ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేస్తారు.

ముట్టుకాడులో ఆకట్టుకుంటున్న ఫ్లోటింగ్ రెస్టారెంట్

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకాభివృద్ధి శాఖ (టీటీడీసీ) ముట్టుకాడు బోటు హౌస్‌లో విదేశీ, స్వదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రూ.5కోట్లతో ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను అత్యాధునిక వసతులతో రూపొందించింది. మంగళవారం సాయంత్రం ఈ రెస్టారెంటును టీటీడీసీ అధికారులు ప్రారంభించారు. సాయంత్రం, రాత్రి వేళల్లో పనిచేయనున్న ఈ రెస్టారెంట్లో డిన్నర్ పార్టీ, వివాహం తదితర శుభకార్యక్రమాలు, లైవ్ బ్యాండ్ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. సరస్సులో ప్రయాణిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించవచ్చు. తిరువాన్మియూర్ నుంచి ప్రారంభమయ్యే ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ప్రవేటు రిసార్ట్‌లు, వీజీపీ వండర్ వరల్డ్, కోవలం క్రోకోడైల్ పార్క్ తదితరాలను సందర్శిస్తున్న పర్యాటకులను ముట్టుకాడు ప్రాంతంలో ఉన్న బోటు హౌస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సేదతీరుతుంటారు. సెలవులు, పండుగ సీజన్లలో ముట్టుకాడు ప్రాంతంలో పర్యాటకులు పెద్ద సంఖ్యలో పర్యటిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొట్ట మొదటి ఫ్లోటింగ్ రెస్టారెంట్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ రూ.5కోట్లతో అందంగా డిజైన్ చేసింది. ఇందుకోసం రెండంతస్తుల నౌకను ఏసీతో సిద్ధం చేసింది. టీటీడీసీ, కొచ్చికి చెందిన గ్రాండ్ య్యూనర్ మెరైన్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా డిజైన్ చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్ స్వదేశీ, విదేశీ పర్యాటికులను ఆకట్టుకుంటోంది.



ముట్టుకాడు బోట్‌హౌస్‌లో రూపొందించిన ఫ్లోటింగ్ రెస్టారెంట్



పెరంబూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ట్రాఫిక్ విభాగం అధికారులు, నిర్వాహకులు

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

• విద్యార్థులకు హెల్మెట్ల వితరణ

ప్యారీస్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, కోటక్ మహీంద్ర, ఐహెచ్ఐఎఫ్, ఐసీడబ్ల్యూట, గ్రామీయం సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పులియాన్‌తోపు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుడలైమణి, ఎస్ఐ సయ్యద్ అమీమ్, సంఘ సేవకులు ఏజే హరిహరన్, డాక్టర్ పి.నారాయణన్, పాఠశాల హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుడలైమణి మాట్లాడుతూ, రాజధాని నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా సంఖ్యకు దీటుగా వాహనాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తుందని, ప్రమాద రహిత నగరంగా ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే వారు, వారి వెనుక కూర్చునేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

అర్ధ మశ్చీంద్ర ఆసనంతో విద్యార్థుల రికార్డు

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండిలో శంకరి యోగా శిక్షణ కేంద్రం ఉంది. ఈ కేంద్రం ఆధ్వర్యంలో వరల్డ్ రికార్డ్ పుస్తకంలో స్థానం దక్కేలా ప్రత్యేక ఆసనాలు వేసే కార్యక్రమం స్థానికంగా ఉన్న మైదానంలో సోమవారం జరిగింది. గుమ్మిడిపూండి యూనియన్ అధ్యక్షుడు శివకుమార్ నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో, ఒకే సమయంలో 105 మంది విద్యార్థులు పది నిముషాలు పాటు అర్ధ మశ్చీంద్ర ఆసనం వేసి సాధన చేశారు. ఈ సాధనను 'వరల్డ్ వైట్ బుక్ ఆఫ్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదుచేసినట్లు ప్రకటించిన సంస్థ నిర్వాహకులు, అందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను యోగా కేంద్రం నిర్వాహకులకు అందజేశారు.



రామేశ్వరంలో వెనక్కి వెళ్లిన సముద్రం



అగ్ని తీర్థం ప్రాంతంలో వెనక్కి వెళ్లిన సముద్రం

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం అగ్ని తీర్థం సమీపంలో సముద్రం వెనక్కి వెళ్లడంతో భక్తులు భయాందోళనలకు గురయ్యారు. రామేశ్వరం రామనాథస్వామి ఆలయ అగ్ని తీర్థం సముద్ర తీరం నుంచి 200 మీటర్ల దూరం లో ఉన్న సముద్రతీరం మంగళవారం ఉదయం ఒక్కసారిగా వెనక్కు మళ్లింది. సముద్రం వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన బండరాళ్లు, సముద్రపు జీవులు బయటకు కనిపించాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో సముద్రం సహజస్థితికి చేరుకుంది. సునామీ విపత్తు అనంతరం అమావాస్య, పౌర్ణమి రోజులకు ముందు, వెనుక సముద్రం వెనక్కి వెళ్లడం, కొద్దిసేపటి అనంతరం యథాస్థితికి చేరుకోవడం జరుగుతుందని ఆ ప్రాంత జాలర్లు తెలిపారు.

తాబేళ్ల గుడ్ల సేకరణకు ప్రత్యేక షెల్టర్లు



బీసెంట్‌నగర్‌లో ఏర్పాటైన షెల్టర్లు

పెరంబూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్‌లో తాబేళ్ల గుడ్ల సంరక్షణకు ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేశారు. సముద్రపు తాబేళ్లు జనవరి నుంచి మార్చి వరకు తీరప్రాంతానికి వచ్చి గుడ్లు పెట్టి వెళ్తుంటాయి. ఒక్కో తాబేలు 140 నుంచి 170 వరకు గుడ్లు పెడుతుంటాయి. ఈ గుడ్లను నక్కలు, పక్షులు ధ్వంసం చేస్తుండడంతో తాబేళ్ల జాతి అంతరించే ప్రమాదముంది. ఈ విషయమై దృష్టి సారించిన అటవీ శాఖ, జంతు ప్రేమికులతో కలసి గుంతల్లోని తాబేళ్ల గుడ్లు సేకరించి, వాటికి ప్రత్యేక స్థలంలో ఉంచి, గుడ్ల నుంచి పిల్లలు వచ్చిన తర్వాత వాటిని సముద్రంలోకి విడిచిపెడుతుంటాయి. ఈ తాబేళ్లు బీసెంట్ నగర్ బీచ్‌లో గుడ్లు పెడుతున్నాయి. 2020 నుంచి ప్రతి ఏడాది సుమారు వంద నుంచి 120 తాబేళ్లు తీరానికి చేరుకొని 6,000 నుంచి 12,000 వరకు గుడ్లు పెట్టి వెళ్తున్నాయి. ఈ ఏడాది రాబోయే రోజుల్లో తీరానికి వచ్చే తాబేళ్ల సంఖ్య పెరుగుతుందని, అందువల్ల తాబేళ్ల గుడ్లు భద్రపరిచేలా ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.



ఆలయ శుద్ధి

తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో.. మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించారు. టీటీడీ చైర్మన్, బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెంటాడి.. గంజాయి వాహనం పట్టివేత

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు సినీఫక్కీలో వెంటాడి పట్టుకున్నాయి. వైజాగ్ నుంచి గంజాయితో ఓ కారు కోట మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంబడించడంతో గంజాయి వాహనం కడివేడు మీదుగా వెళ్లిపోయింది. కోట మండలంలోని విద్యానగర్, చంద్రశేఖర్‌పురం, చిట్టేడు, కేశవరం, కొండుగుంట మార్గాల్లో వెళుతున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంటాడాయి. విద్యానగర్‌లోని పెట్రోల్ బంకు వద్ద స్థానిక యువకులు ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో గంజాయి వాహనం ఆగిపోయింది. పోలీస్, టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఆ కారులో సుమారు 80కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.



ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 54,180

తలనీలాలు సమర్పించినవారు: 17,689



సొంత ట్యాంకర్‌తో మొక్కలకు నీటిని పడుతున్న శ్యామ్



నరశింగరావుపేట ప్రాంతంలోని రెల్వేస్టేషన్ గోడ ఆనుకుని శ్యామ్ నాటిన మొక్కలు

మొక్కవోని లక్ష్యం



- గ్రీన్ మ్యాన్ గూడూరు శ్యామ్‌కుమార్‌రెడ్డి

మొక్కల పెంపకం ద్వారా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారో వ్యక్తి. గూడూరులోని షాదీమంజిల్ సమీపాన నివాసముంటున్న మద్దాలి శ్యామ్‌కుమార్‌రెడ్డి ప్రైవేటు కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వృత్తితోపాటు నిరంతరం తన ప్రవృత్తి కూడా నిర్వర్తిస్తున్నారీయన. 22 ఏళ్లుగా పట్టణంలోని వీధుల్లో, కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద మొక్కలను నాటుతున్నారు. పచ్చదనం పరిరక్షణ కోసం మోడుమారుతున్న మొక్కలకు ప్రాణం పోస్తున్నారు. తానే ట్రక్కుఆటో కొని వాటర్‌క్యాన్‌లో నీటిని నింపుకుని తీసుకువెళ్లి మొక్కలకు పోసి కన్నబిడ్డల్లా సాకుతున్నారు. ఈయన నాటిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. తుపాన్లలో నేల కొరిగిన వాటినీ నిలబెట్టి ప్రాణం పోస్తూ కాలుష్యరహిత సమాజానికి తనవంతు కృషిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మొక్కలు పెంచడం ఎంతో ఇష్టమని చెబుతారు శ్యామ్‌కుమార్‌రెడ్డి. పొగడ, కానుగ, వేప, మర్రి, నేరేడు, బాదం, దేవగన్నేరి, టెంపుల్, మారేడు తదితర ఎన్నో రకాల మొక్కలను నాటారు. మొదట్లో వెయ్యికి పైగా మొక్కలను స్వయంగా నాటి రోజూ నీరు పోసేవారు. ఈయనలోని సామాజిక దృక్పథాన్ని గమనించిన కొందరు దాతలు ముందుకొచ్చారు. మొక్కల కోసం ట్రీగార్డులను అందజేయడం ప్రారంభించారు. ఈయన ప్రయత్నానికి చోదోడుగా నిలిచారు. ఇప్పటికే 5వేలకు పైగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు శ్యామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో పచ్చదనం వ్యాప్తికి శ్యామ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)





తుపానులో కూలిపోయిన టెంపుల్‌ట్రీ చెట్టును నిలబెట్టి.. ప్రాణం పోశారు ఇలా..

చెడిపోయిన మాంసం

- కుళ్లిన కూరగాయలు
- ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో విస్తుపోయే నిజాలు
- 14 హోటళ్లలో తనిఖీలు చేసి నోటీసులు జారీ
- చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర డైరెక్టర్ పూర్ణచంద్రరావు



తిరుచానూరు వద్ద ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 10 బృందాలుగా ఏకకాలంలో దాడులు చేశాయి. నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిలిఇంచారు. తిరుచానూరు వద్దనున్న ఓ హోటల్‌లో కుళ్లిపోయి, గడ్డకట్టిన్న మాంసాన్ని డీప్ ఫ్రిడ్జిలో ఉంచడం బయటపడింది. అనుమతుల్లేని ఎసన్స్‌లు వాడుతున్నట్లు చర్చించారు. చెడిపోయిన టమోటాలతో చట్నీ, సాస్‌ల తయారీ.. చికెన్ కబాబ్ తదితరాలను మళ్లీ వేడి చేసి కస్టమర్లకు వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లలో ఇలాగే చేస్తారా అంటూ సిబ్బందిని నిలదీశారు. రేణిగుంట రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో మూడు నెలల క్రితం కాలపరిమితి దాటిన ఊరగాయల బాటిళ్లను, చెడిపోయిన నూడుల్స్, పుట్టగొడుగులు, చికెన్ కబాబ్‌ను గుర్తించారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంటులోని కొన్ని ఆహార పదార్థాలను సీజ్ చేశారు. మరో హోటల్‌లో ఫ్రిడ్జి పనిచేయక ఆహార పదార్థాలు, పెరుగు చెడిపోయిందని, వీటిని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగులు కలిపిన కందిపప్పు చెడిపోయిన జీడిపప్పు, పుట్టగొడుగులు ఉన్నట్లు ఇంకో హోటల్ తనిఖీల్లో బయటపడింది. ఇంకో హోటల్‌లో తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తనిఖీ చేయగా.. వండి నిల్వ వుంచిన ఆహార పదార్థాలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం కొన్ని హోటళ్ల, తోపుడు బండ్లపై టిఫిన్లు, వివిధ రకాల తినుబండారాలను తనిఖీ చేశారు. ఆయా తనిఖీల్లో కర్నూలు ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాలరావు, తిరుపతి నుంచి మద్దిలేటి, జగదీష్, సుమన్, చిత్తూరు నుంచి శ్రీనివాస్, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పదార్థాల్లో రంగు, రుచి కోసం వాడుతున్న కలర్లు డూప్లికేట్‌వి గుర్తించారు. నగరంలోని మరో హోటల్‌లో కాలపరిమితి ముగిసిన రోటీలు, బ్రెడ్లు, పుట్టగొడుగులు బయటపడ్డాయి. ఇంకో హోటల్‌లో గోబీ మంజూరి, జాంగ్రీ చెడిపోయి వుందని తనిఖీ అధికారులు చెప్పారు. ఇంకో హోటల్‌లో పురుగులు పట్టిన అలసందలు, నువ్వులు, కొన్ని

ల్యాబ్‌కు పంపి చర్యలు తీసుకుంటాం

మా తనిఖీల్లో బయటపడిన ఆహార పదార్థాలు, ముడిసరుకులను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. ఎవ్వరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదు. ల్యాబ్‌కు పంపిన బిర్యానీ, వివిధ ముడిపదార్థాలు, సరకుల్లో లోపాలుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అన్ని హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తుండటాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నాం.

- పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్

రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన 27 రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించామని పేర్కొన్నారు.

వినియోగదారులపై ఆర్థిక భారం తగదు



ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలపైనే ఏపీఈఆర్‌సీ ఆర్థికభారాన్ని మోపడానికి దిగడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నేత కందారపు మురళి పేర్కొన్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన వర్చువల్‌గా తన వాదన వినిపించారు. ప్రజాభిప్రాయ సేకరణలు చేపట్టినా చివరకు ప్రభుత్వాల ఆదేశాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. చార్జీలు పెంచడానికి ఇచ్చిన అనుమతులే ఇందుకు నిదర్శనమన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందం, స్మార్ట్ మీటర్లు అమర్చడం వంటివి నియంత్రణ మండళ్ల నిస్సహాయతకు సాక్ష్యాలని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ32 వేల కోట్ల భారాన్ని మోపితే, కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రూ.16 వేల కోట్లు భారాన్ని వినియోగదారులపై మోపడం అన్యాయమని తెలియజేశారు. ప్రభుత్వాలు 25 ఏళ్లకు ఒప్పందాలు చేసుకోవడం, ఒక యూనిట్ విద్యుత్ కూడా కొనుగోలు చేయకుండా లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉత్పత్తిదారులకు చెల్లించడాన్ని రద్దు చేయాలన్నారు. సెకీ, అదానీల ఒప్పందాలను రద్దు చేసి తిరిగి టెండర్లను ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు, ఈఈ వి.చంద్రశేఖర్ రావు, వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి పక్షుల పండుగ

- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి
- విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఆదేశం



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

తడ/సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఈ 18వ తేది నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించాలని నిర్ణయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి మంగళవారం ఆయన దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని, సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప వద్ద పులికాట్ సరస్సు, వన్యప్రాణి విభాగం విజ్ఞానకేంద్రం, జూనియర్ కళాశాల మైదానం, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవును పరిశీలించారు. పండుగ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధుల సూచనలను స్వీకరించారు. సూళ్లూరుపేటలోని ఓ కల్యాణ మండపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోను.. పర్యటనల్లోనూ ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించలేదని, ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. 18వ తేది శనివారం శోభాయాత్రతో ఈ పండుగ ప్రారంభమవుతుందని నేలపట్టు, అటకానితిప్పల్లో పక్షులను వీక్షించడం, భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తామని వివరించారు శ్రీసిటీలోనూ కార్యక్రమాలు నిర్వహించేలా నిర్ణయించామన్నారు. పర్యాటకుల కోసం పడవలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఏర్పాట్లు చేయడానికి తన అధ్యక్షతన 16 మంది అధికారులతో పండుగ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పక్షుల పండుగ నేపథ్యంలో నేలపట్టుకు గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్పకు డీఆర్‌డీఏ పీడీ, భీములవారిపాళెం మత్స్యశాఖ ఏడీ, శ్రీసిటీకి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, సూళ్లూరుపేట కార్యక్రమాలకు డ్వామా పీడీలను ఇన్‌చార్జులుగా నియమించామన్నారు. జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఆయన మీడియాతోనూ మాట్లాడారు. మన ప్రాంతంలో జరిగే పక్షుల పండుగను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, డీఆర్వో నరసింహులు, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణశాఖ డీఎఫ్ఓ హారిక, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, డీపీఎం శ్రీనివాసరావు, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, మత్స్యశాఖ ఏడీ నాగరాజు, ఆయా మండలాల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

2,770 సీసీ కెమెరాల నిఘాలో వైకుంఠద్వార దర్శనాలు

- 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు
- 9న ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు వచ్చే భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం 2,770 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. తిరుపతిలో సర్వదర్శన టోకెన్లు జారీ చేసే కేంద్రాల్లోనూ 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.



తిరుపతిలో క్యూల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో గౌతమి, ఎస్పీ సుబ్బరాయుడు

వైకుంఠద్వారదర్శనం టోకెన్లు ఇచ్చే కేంద్రాలు

తిరుపతిలో: ఇందిరామైదానం, రామచంద్ర పుష్కరిణీ, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్‌పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఈ కేంద్రాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ కేంద్రాల్ల వద్ద గూగుల్ లొకేషన్ మ్యాప్స్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో : కమ్యూనిటీ హాల్‌లోని 4 కౌంటర్లలో.

వసతి ఏర్పాట్లు: పదిరోజుల పాటు తిరుమలలో వసతి ఆన్‌లైన్ బుకింగ్ రద్దు. సామాన్య భక్తులకు మాత్రం సీఆర్వోలో గదులు కేటాయిస్తారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజీ డోనార్ స్కీం అలాట్మెంట్ కౌంటర్లు మూసివేస్తారు.

పార్కింగ్: తిరుమలలో 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎంబీసీ, ఔటర్ రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. టికెట్లపై ఎంట్రీ పాయింట్, అలైటింగ్ పాయింట్, పార్కింగ్, పికప్ పాయింట్ల వివరాలు ముద్రిస్తారు.

ఇతర నిర్ణయాలు

- దర్శన టోకెన్లు కలిగిన భక్తులకే క్యూలైన్‌లోకి అనుమతి.
- జనవరి 9వ తేదీకి అదేరోజుకు ఇచ్చే ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు.
- శ్రీవారిమెట్టు మార్గంలో టోకెన్ జారీ కౌంటర్లు జనవరి 19వ తేదీ వరకు మూసివేత.
- వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు.
- భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా మంచినీరు, అన్నప్రసాదాల పంపిణీ. అన్నప్రసాద కేంద్రాలతో పాటు ఫుడ్‌కౌంటర్ల ద్వారా సాంబారన్నం, పాలు, టీ, స్నాక్స్, మంచి నీరు పంపిణీ.
- 3 వేల మంది యువ శ్రీవారిసేవకులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు.
- 2,082 మంది సిబ్బందితో పారిశుధ్యం. అదనంగా 150 కేటాయింపు.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీ వద్ద మంగళవారం వేకువజామున ఓ కారు కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాలేనికి చెందిన ఎ.ప్రశాంత్ మంగళవారం తెల్లవారుజామున తిరుపతి నుంచి రేణిగుంటకు వెళుతున్నారు. ఆ సమయంలో కరకంబాడి రోడ్డులో కారు అదుపు తప్పి పక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వెనకే ఉన్న ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు, నుజ్జు అయింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కాగా, నిద్ర.. మద్యం మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి చెప్పారు.



చెరకు కూలీలపై దూసుకెళ్లిన కంటైనర్

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



చెరకు కూలీలను ఢీకొన్న కంటైనర్

నారాయణవనం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెరకు కట్టలు పేర్చుతున్న కూలీలపైకి కంటైనరు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. నారాయణవనం మండలంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నైనారు కండ్రిగ వద్ద చెరకు తోటలో చెన్నైలోని విల్లుపురానికి చెందిన రాజన్(55), తనికవేలు ఉదయం 6 గంటల ప్రాంతంలో చెరకు గడలను తీసుకొచ్చి రోడ్డుపై పేర్చుతున్నారు. చెన్నై నుంచి తిరుపతి వైపుగా వస్తున్న లారీ కంటైనర్ నేరుగా వారిని ఢీకొట్టింది. పేర్చిన చెరకు గడలకు, లారీకి మధ్యలో రాజన్ నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తనికవేలు తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో యూజీసీ బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగాన్ని యూజీసీ బృందం పరిశీలించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దూరవిద్య విభాగం నిర్వహణ, కోర్సులు, బోధన, విద్యార్థులు, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సిబ్బంది, పనితీరు వంటి పలు వివరాలను పరిశీలించారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా విభాగ అభివృద్ధి, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. దూరవిద్య పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సెనేట్ హాల్లో సమావేశమై పలు వివరాలను తెలుసుకున్నారు. డీఎస్టీ పర్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ బృందంతో ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర, ఆచార్య అరింద్ రనడే, యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ వినోద్ సింగ్ యాదవ్ ఉన్నారు. వీరికి దూరవిద్య ప్రగతిని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, దూరవిద్యా డైరెక్టర్ తవమణి వివరించారు. ఈ పర్యటన తర్వాత దూరవిద్యకు గుర్తింపును ప్రకటించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యను పరిశీలిస్తున్న యూజీసీ బృందం